క్లుప్తంగా

అనుమతులు లేకుంటే చర్యలు

మహమ్మదాబాద్: ప్రైవేట్ పాఠశాలలను యాజమాన్యాలు అనుమతి లేకుండా నిర్వహిస్తే చర్యలు తప్పవని మండల విద్యాధికారి వెంకటయ్య హెచ్చరించారు. జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు మహమ్మదాబాద్‌లోని న్యూ బ్రిలియంట్ పాఠశాలను తనిఖీ చేశారు. అనుమతి, సౌకర్యాలు తదితరాలపై ఆరా తీశారు. ఇరుకైన భవనంలో పాఠశాల నిర్వహిస్తున్నారని ఫిర్యాదు అందిన మేరకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. 8వ తరగతి నిర్వహణపై అనుమతి లేదన్నారు. అదేవిధంగా సెకండ్‌ఫ్లోర్‌లో తరగతి గదుల నిర్వహణకు అనుమతి లేదన్నారు. గ్రౌండ్‌ఫ్లోర్, సెల్లార్లలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీల నిర్వహణ సరికాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మొదలే ఫీజులు 50శాతం తీసుకున్నారని, అనుమతి లేకుండా హాస్టల్ నడుపుతున్నారని అన్నారు. వివిధ అంశాలపై ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్లు వివరించారు. సెకండ్, గ్రౌండ్ ఫ్లోర్‌లు మూడురోజుల్లో ఖాళీ చేయాలని ఆదేశించారు.

చిన్నారులను అంగన్‌వాడీలకు పంపండి

చిన్నచింతకుంట: చిన్నారులను వారి తల్లిదండ్రులు అంగన్‌వాడీలకు పంపించాలని సూపర్‌వైజర్ రజిత సూచించారు. సోమవారం అల్లిపురం కేంద్రంలో అంగన్ వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. టీచర్ కౌసల్య గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సత్యవతి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గోపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణ

భూత్పూర్: మున్సిపాలిటీలోని 8వ వార్డులో సోమవారం మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని చైర్మన్ బస్వరాజ్ గౌడ్ ప్రారంభించారు. కౌన్సిలర్ తహసీన్ ఫాతిమా ప్రత్యేక చొరవ తీసుకొని కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, ఫారూఖ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వానరాన్ని కాపాడిన పారిశుద్ధ్య సిబ్బంది

భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలో సోమవారం ఓ వానరం విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలో ఉండిపోయింది. ఈ క్రమంలో మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది గమనించి అది బతికే ఉన్నట్లు గుర్తించారు. సమీపంలోని పశువైద్య కేంద్రంలో డా. మధుసూదన్‌కు చూపించారు. ఆయన చికిత్స చేయడంతో కొద్ది నిమిషాలకే దానికి స్పృహ వచ్చి సమీపంలో ఉన్న వానర గుంపులోకి వెళ్లిపోయింది. ఈ మేరకు మున్సిపల్ సిబ్బందిని పశువైద్యాధికారి అభినందించారు.

ఫీజు గడువు పెంచాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో సెమిస్టర్ ఫీజు గడువు పెంచాలని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకులు కంట్రోలర్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. డీఎస్సీ, గ్రూప్స్ పరీక్షలు ఉన్న నేపథ్యంలో విద్యార్థులకు టైం టేబుల్ కూడా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. రూప్‌సింగ్, భరత్, శ్రీను, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

హన్వాడ: మండల బీజేపీ అధ్యక్షుడు వెంకటయ్యకు మాతృవియోగం విషయం తెలుసుకున్న ఎంపీ డీకే అరుణ సోమవారం రాత్రి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ క్రమంలో పలువురు నాయకులు ఎంపీని కలిశారు. పలు విషయాలపై వినతిపత్రాలు ఇచ్చారు.

బాలిక అదృశ్యం

జడ్చర్ల: చౌటగడ్డతండాకు చెందిన బాలిక(16) ఆదివారం నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. తల్లి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన తరువాత ఇంట్లో ఉన్న బాలిక ఎక్కడికో వెళ్లిపోయిందని అన్నారు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె తల్లి ఫిర్యాదు చేశారని వివరించారు.

బైక్‌పై నుంచి పడి ఇద్దరికి గాయాలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని కోయిల్‌సాగర్ రోడ్‌లో మార్కెట్ యార్డు ముందు బైక్ అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. కోయిల్‌కొండ మండలం చెర్లపల్లికి క్షతగాత్రులు సోమవారం రాత్రి బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా ఘటన చోటుచేసుకుంది. ఘటనలో ఒకరికి తీవ్రంగా గాయాలయ్యాయి. కాగా వారిని అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియరాలేదు.

వివాహాలకు దుబారా ఖర్చులు వద్దు

స్టేషన్ మహబూబ్‌నగర్: వివాహాల నిర్వహణ సులభతరం చేసి దుబారా ఖర్చును అరికడదామని జమాతే ఇస్లామీ హింద్ ఉపాధ్యక్షుడు మౌలానా వలీవుల్లా సయీది ఫలాహి అన్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన ఓ సభలో ఆయన ముఖ్యవక్తగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుతం సమాజంలో పెళ్లిలకు అధిక ఖర్చు చేస్తున్నారని, దీని వల్ల ఆడపిల్లల తల్లిదండ్రులపై ఎంతో భారం పడుతుందన్నారు. వివాహాలను సులభతరం చేయడానికి కృషి చేద్దామని అన్నారు. మహబూబ్‌నగర్, వనపర్తి అధ్యక్షులు మహ్మద్ ఖాజా, మౌలానా నాసిర్ మజహరి, మౌలానా సమీర్ జామి పాల్గొన్నారు.

అంతర్గత దారులు అధ్వానం

- ఎక్కడికక్కడ రాళ్లు, కంకర తేలి వాహనదారులకు ఇబ్బందులు
- ఏ వార్డులోనూ కొత్త సీసీ, బీటీ రోడ్లు నిర్మించని వైనం
- సమావేశాల్లో కౌన్సిలర్లు కోరినా పట్టించుకోని అధికారులు


మున్సిపల్ కార్యాలయానికి ఎదుట రోడ్డు పరిస్థితి


ఎస్ఆర్‌నగర్ సమీపంలో కంకర వేసి వదిలేసిన తీరు..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. 49 వార్డుల్లో సుమారు తొమ్మిది నెలలుగా ఎక్కడా కూడా సీసీ లేదా బీటీ రోడ్లు నిర్మించిన దాఖలాలు లేవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి ప్రత్యేక నిధులు మంజూరు కాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. మూడు నెలలకోసారి జరిగే సాధారణ సర్వసభ్య సమావేశంలో కౌన్సిలర్లు తమ వార్డుల్లో ఎక్కడికక్కడ రోడ్లు దెబ్బతిన్నాయని ప్రస్తావిస్తున్నా అధికారుల నుంచి స్పందన కరువైంది. ఇటీవల ఆస్తిపన్ను, నల్లాబిల్లులు, ట్రేడ్ లైసెన్స్ తదితర ఆదాయ వనరుల నుంచి సుమారు రూ.20 కోట్లు సాధారణ నిధుల కింద వచ్చినా ఉపయోగం దక్కలేదు. ఈ నిధులు కేవలం అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతభత్యాలతో పాటు ప్రతినెలా విద్యుత్ చార్జీలు, ఇతర నిర్వహణ ఖర్చులకే వినియోగించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇక బీఆర్ఎస్ హయాంలో గత ఏడాది రూ.వంద కోట్ల ఫ్లడ్ రెస్టోరేషన్ పేరిట శాసనసభ ఎన్నికలకు ముందు 250 చోట్ల సీసీ రోడ్లు మంజూరైనా కేవలం 13 మాత్రమే పూర్తి చేశారు. వీటికి సంబంధించి కాంట్రాక్టర్లకు ఇప్పటివరకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇంతకు ఈ నిధులు వస్తాయో.. రావో..? అటు అధికారులు, ఇటు పాలకవర్గం స్పష్టంగా తెలపడం లేదు.

తాగునీటి కోసం తవ్వి సరిగా పూడ్చలే..

మరోవైపు నాలుగేళ్ల క్రితం మిషన్ భగీరథ పైపులైన్ల కోసం అన్ని వార్డుల లోని గల్లీల్లో సీసీ, బీటీ రోడ్లను అడ్డంగా తవ్వారు. ఆ తర్వాత వాటి గుంతలు పూడ్చలేదు. దీంతో వాహనాల రాకపోకలకు, పాదచారులకు తీవ్రంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అప్పట్లో ప్రతి కౌన్సిలర్‌కు ప్యాచ్‌వర్క్ పేరిట రూ.ఐదు లక్షలు కేటాయించామని మున్సిపల్ అధికారులు చెబుతున్నా ఫలితం కనిపించడం లేదు. కనీసం ఈ పథకం ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్ తీసుకున్న వారైనా వీటిని సరి చేయకపోవడంతో ఎక్కడికక్కడ ఈ రోడ్లన్నీ గతుకులమయంగా మారాయి. ఇక పది విలీన గ్రామాల్లో చాలా వరకు మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. అప్పట్లో శ్రీనివాసకాలనీచౌరస్తా నుంచి ఊరగుట్ట వరకు, పద్మావతీకాలనీ ఆర్చ్ నుంచి కృష్ణా టెంపుల్ చౌరస్తా వరకు, టీచర్స్‌కాలనీ నుంచి మర్లు వరకు, తూర్పుకమాన్ నుంచి పాత రైల్వేగేట్ వరకు, వన్‌టౌన్ చౌరస్తా నుంచి క్లాక్‌టవర్ వరకు మిషన్ భగీరథ పథకంలో కొత్తగా సీసీ రోడ్లు నిర్మించారు. ఇవి తప్పా మిగతా చోట్ల 15–20 ఏళ్ల నాటి రోడ్లే దిక్కయ్యాయి. కంకర, రాళ్లు తేలి గుంతలు పడ్డాయి.

ఈ ప్రాంతాల్లో నడవాలంటే నరకమే..!

జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్, షాషాబ్‌గుట్ట, శేషాద్రినగర్, టీడీగుట్ట, భగీరథ కాలనీ, టీచర్స్ కాలనీ, రామయ్యబౌలి, బీకేరెడ్డికాలనీ, గణేష్‌నగర్, వల్లభ్ నగర్, కిసాన్‌నగర్, బండ్లగేరి, కుర్విన శెట్టికాలనీ, పాతపాలమూరు, న్యూగంజ్, హనుమాన్‌నగర్, కొత్తచెరువురోడ్డు, సంజయ్‌నగర్, బోయపల్లిగేట్, మోతీనగర్, రాజేంద్రనగర్, స్టేషన్‌రోడ్డు, హనుమాన్ పురా తదితర ప్రాంతాల్లోని గల్లీలలో నడవడానికి నరకయాతన తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. అసలే ఇరుకు రోడ్లు కావడంతో బైక్‌లు, ఆటోలు, కార్లు తదితర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుత సీజన్‌లో భారీ వర్షాలు కురిసినప్పుడు ఎక్కడ ఏ గుంత ఉందో తెలియని పరిస్థితి నెలకొంది.

> **పనులు చేపడతాం**
>
> వార్డుల్లో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి సాధారణ నిధులు వినియోగించడం కుదరదు. ఇటీవల టీయూఎఫ్ఐడీసీ నుంచి మంజూరైన రూ.37.87కోట్లతో పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు చేపడతాం. వీలైనంత తొందరగా వీటికి టెండర్ ప్రక్రియ నిర్వహిస్తాం.
>
> – డి.మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్

తాజాగా రూ.37.87 కోట్లు మంజూరు

ఇలాంటి తరుణంలో ఇటీవల మహబూబ్‌నగర్ మున్సిపాలిటీకి తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) నుంచి రూ.37.87 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పట్టణంలోని వివిధ వార్డులలో పది చోట్ల సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించేందుకు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు చేశారు. కనీసం ఈ పనులకైనా వెంటనే టెండర్లు చేపట్టి ప్రారంభిస్తే పట్టణ ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. వాస్తవానికి వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని టీయూఎఫ్ఐడీసీకి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనలు పంపినా ఫలితం దక్కలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇటీవల కొత్త ప్రతిపాదనలను ఇంజినీరింగ్ అధికారులు తయారుచేసి మళ్లీ పంపగా ఎట్టకేలకు ఇప్పుడు మంజూరయ్యాయి.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడుల్లో బోధన


మాట్లాడుతున్న సీఎంఓ బాలుయాదవ్

కోయిల్‌కొండ: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడుల్లో బోధన అందిస్తున్నట్లు సీఎంఓ బాలుయాదవ్ తెలిపారు. సోమవారం మండలంలోని యుపీఎస్ కేశ్వాపూర్, రాజనాయక్ తండా పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యునిఫాంలు అందజేతపై అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతతో అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆయన వెంట సీఆర్పీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ


విద్యార్థితో పాఠం చదివిస్తున్న ఎంఈఓ మంజులాదేవి

జడ్చర్ల టౌన్: ఆలూరు జెడ్పీహైస్కూల్‌ను సోమవారం ఎంఈఓ మంజులాదేవి తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పరిశీలించారు. సామర్థ్యాలను తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కింద చేపట్టిన పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తిచేసేలా చూడాలని హెచ్ఎం యుగంధర్‌కు సూచించారు.

మిడ్జిల్: మండల పరిధిలోని రాణిపేట్ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈఓ మంజులాదేవి తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

నవాబుపేట: మండల పరిధిలోని లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పద్మారెడ్డి, శేఖర్ రెడ్డి, భీంరెడ్డి, యాదగిరి, సరిత, తిరుపతయ్య, బాలకిష్టయ్య, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టీబీపై అవగాహన అవసరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నవాబుపేట: మరికల్‌లో మండల వైద్యాధికారి డాక్టర్ నవీన్‌చంద్ర ఆధ్వర్యంలో సోమవారం టీబీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో టీబీపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. మొదటి దశలోనే వ్యాధిని గుర్తించి చర్యలు తీసుకునే విధంగా వివిధ అంశాలపై ప్రజలకు వివరించారు. శిబిరంలో 169 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీజ, ఎంపీహెచ్ఓ శ్రీనివాసులు, శరభలింగం, శ్రీను పాల్గొన్నారు.

ధరణి ఫైల్స్ త్వరగా పూర్తి చేయండి


తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి సూచనలు చేస్తున్న కలెక్టర్ విజయేందిర

రాజాపూర్(బాలానగర్): ధరణికి సంబంధించిన పెండింగ్ ఫైల్స్‌ను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బాలానగర్ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. సోమవారం కార్యాలయానికి విచ్చేసిన ఆమె పెండింగ్ ఫైల్స్‌పై ఆరా తీశారు. కాగా ఇప్పటివరకు నాలుగు వందలకు పైగా పెండింగ్ ఫైల్స్ పూర్తి చేసినట్లు ఆయన వివరించారు. మిగిలిన వాటిని ఫీల్డ్ విజిట్ చేసి పూర్తి చేస్తామని తెలిపారు.

పొలాలకు దారి కోసం ఫిర్యాదు

రాజాపూర్: మండల పరిధిలోని కుచ్చర్‌కల్ శివారులో సర్వే నంబర్ 120, 121, 123, 124, 125, 126లలో గతంలో గ్రామపంచాయతీ లేవుట్ చేసిన వారు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లకుండా బాటను బందు చేశారని గ్రామస్తులు అన్నారు. ఈ మేరకు సోమవారం బాట వదిలించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో వినతి అందించారు. రైతులు బైండ్ల నర్సింహ, చీమల శేఖర్, సున్నపు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. విషయంపై విచారణ జరపాలని కలెక్టర్ డీపీఓను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

మూసాపేట ఎస్ఐగా పి.శ్రీనివాసులు

అడ్డాకుల: మూసాపేట ఎస్ఐగా పి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఆయన భూత్పూర్ ఠాణాలో ఎస్ఐగా పనిచేసి బదిలీపై మూసాపేటకు వచ్చారు. కాగా ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న సుజాత ఇటీవల సెలవుపై వెళ్లడంతో ఆమె స్థానంలో శ్రీనివాసులును కేటాయించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎరువుల విక్రయంపై ఆరా

భూత్పూర్: రైతులకు ఆధార్ ఆధారంగా ఎరువులు విక్రయించాలని టాస్క్‌ఫోర్స్ అధికారి గోపీనాథ్ సూచించారు. సోమవారం పట్టణంలో పలు ఎరువులు, పెస్టిసైడ్ దుకాణాలను తనిఖీ చేశారు. పలు సూచనలు చేశారు. ఎరువుల విక్రయంపై ఆరా తీశారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఎస్ఐ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో 395 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ ఎవరిపైనా వివక్ష చూపదన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా రూ. 270 కోట్లతో డ్రెయినేజీలు, సీసీరోడ్ల కోసం శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. మున్సిపల్‌లోని వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కౌన్సిలర్లకు, చైర్మన్‌కు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్లు వివరించారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని స్పష్టం చేశారు. వనమహోత్సవంలో బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పట్టణంలో ఈ ఏడాది 50వేల మొక్కలు నాటాలనే లక్ష్యంగా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, తహశీల్దార్ ఘన్సీరామ్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మొహర్రం వేడుకలు



దేవరకద్ర: కౌకుంట్ల, దేవరకద్ర మండలాల్లోని పలు గ్రామాలలో మొహర్రం వేడుకలు సోమవారం కొనసాగుతున్నాయి. పీర్ల మసీదుల వద్ద భక్తుల సందడి నెలకొంటోంది. ప్రజలు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుంటున్నారు. సాయంత్రం వేళ అలాయ్ ఆడుతున్నారు.

రూ. వెయ్యి కోట్లు కేటాయించాలి

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఏర్పాటు ప్రకటన చేయడం సంతోషించదగ్గ విషయమని.. అదేవిధంగా జనాభాకు అనుగుణంగా ఏటా రూ. 1000 కోట్లు కేటాయించాలని నాయకులు అన్నారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఆర్.రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సీరామ్‌నాయక్‌ను కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

ఒక్క సీసీకెమెరా వంద మందితో సమానం

- డీఎస్పీ లింగయ్య


మంతనోగోడ్‌లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ లింగయ్య

మక్తల్: ఒక్క సీసీ కెమెరాను ఏర్పాటు చేస్తే వంద మంది పోలీసులతో సమానమని నారాయణపేట డీఎస్పీ లింగయ్య అన్నారు. సోమవారం మక్తల్ మండలం మంతన్‌గోడ్‌లో రాత్రి 8 గంటలకు గ్రామస్తుల సహకారంతో 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల నేరాలు అదుపులోకి వస్తాయని, ఒకవేళా దొంగతనాలు జరిగితే సీసీ కెమెరాల నుంచి గుర్తు పట్టవచ్చని అన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రధాన కూడలి దగ్గర సీసీ కెమెరాలను ఏర్పాటు చేందుకు దాతలు ముందు రావాలని కోరారు. మంతన గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోని మిగతా గ్రామాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. పోలీసులు నిరంతరంగా ప్రజల రక్షణ కోసం కృషి చేస్తున్నారని, అందరు సహకరించాలని కోరారు. సీసీ కెమెరాలు 24 గంటలు పని చేస్తున్నాయని, ప్రజలకు రక్షణగా ఉంటాయన్నారు. గ్రామం కోసం గ్రామస్తులు సహకారం చేయడంతో ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ విలేజ్ పోలీస్ అశోక్‌కుమార్‌ను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో మక్తల్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదంపై ప్రచారం.. స్పందించిన పోలీస్



గంట వ్యవధిలోనే గుంతల రోడ్డు వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడు

మరికల్: వర్షాలకు గుంతలుగా మారిన నారాయణపేట రోడ్డుపై వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారని, మరమ్మతు చేయాలని చంద్రశేఖర్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో పెట్టాడు. ఫోన్‌లో చూసి స్పందించిన పోలీస్ సిబ్బంది అక్కడ ప్రమాదాలు చోటుచేసుకోకుండా గుంతలు పడిన రోడ్డు వద్ద బారికేడు ఏర్పాటు చేయించారు. గుంతల రోడ్డును ప్రయాణికులు గమనించాలని సోషల్ మీడియాలో ప్రచారం చేసిన చంద్రశేఖర్ ప్రయత్నానికి గంట వ్యవధిలోనే పోలీసుల నుంచి స్పందన వచ్చింది.

పర్యావరణాన్ని కాపాడుకుందాం


ఆచార్యపూర్‌లో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ కాళప్ప తదితరులు

కోయిల్‌కొండ: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎంపీడీఓ కాళప్ప సూచించారు. సోమవారం ఆచార్యపూర్ రోడ్డు పక్కన పరిసరాలల్లో ఉపాధిహామీ సిబ్బందితో కలిసి ఆయన మొక్కలు నాటారు. మాజీసర్పంచ్ రాము, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: ఎంపీడీఓ దేవన్న, ఇతర అధికారులు సోమవారం అన్నారెడ్డిపల్లి, మొకర్లాబాద్, నంచర్ల ఉన్నత పాఠశాలల్లో వనమహోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రతి మొక్కనూ బతికించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేఎం నారాయణ, ఏపీఓ హరిచ్చంద్రుడు తదితరులు ఉన్నారు.

నవాబుపేట: మండలంలో సోమవారం మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీల పర్యటన నేపథ్యంలో మండల అధికారులు తమ కార్యాలయం సమీపంలో మొక్కలు నాటారు.

మార్కెట్‌లో వస్తున్న మార్పులను గమనించాలి


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రస్తుతం మార్కెట్‌లో వస్తున్న మార్పులను ఎంబీఏ విద్యార్థులు నిశితంగా గమనించాల్సిన అవసరం ఉందని పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. పీయూలో ఎంబీఏ విద్యార్థులకు ప్రాజెక్టు వర్క్‌లపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రతి అంశాన్ని పరిశోధన కోణంలో చూడాలన్నారు. అనంతరం విద్యార్థులు సమర్పించిన ప్రాజెక్టులలో ఒక దానిని ఎంపిక చేసి బహుమతిని ప్రదానం చేశారు. ప్రొఫెసర్ అచలపతి, కన్వీనర్ అర్జున్‌కుమార్, నాగసుధ, అరుంధతి, జావెద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు ఏర్పాటు చేయాలని ఎంపీకి వినతి


వినతిపత్రం అందజేస్తున్న ఇబ్రహీంపల్లి వాసులు

రాజాపూర్: మండల కేంద్రంలో సోమవారం డబుల్ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమానికి ముందుగా వచ్చిన మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను ఇబ్రహీంపల్లి గ్రామస్తులు కలిశారు. తమ గ్రామం వరకు బీటీరోడ్డు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. ముదిరెడ్డిపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద జాతీయరహదారిపై అండర్‌బ్రిడ్జి ఏర్పాటు చేయడంతో పాటు రాయపల్లి గ్రామం వరకు బీటీరోడ్డును వేయించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు రామృష్ణ, నాయకులు బాలవర్ధన్‌గౌడ్, సూరిగౌడ్, ఆనంద్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండలం అభివృద్ధి పనుల కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎంపీ డీకే అరుణను బీజేపీ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. వివిధ సమస్యలపై వినతిపత్రం అందించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆస్పత్రికి సిమెంట్ బెంచీల వితరణ

జడ్చర్ల టౌన్: స్థానిక ఏరియా ఆస్పత్రికి 6 సిమెంట్ బెంచీలను సోమవారం అమ్మ సేవాసమితి నిర్వాహకులు వ్యవస్థాపకుడు జగదీశ్ జయంతి పురస్కరించుకుని అందజేశారు. ఆస్పత్రి ప్రాంగణంలో వీటిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు, డాక్టర్లు పాల్గొన్నారు.

పురస్కారం అందజేత

జడ్చర్ల టౌన్: పట్టణానికి చెందిన సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణకు సోమవారం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో కళాసేవకుడు పురస్కారం అందజేశారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో శాఖ రాష్ట్ర అధ్యక్షుడు డా.కళాకృష్ణ పురస్కారాన్ని అందించారు. ఈమేరకు రాధాకృష్ణను సంస్కారభారతి సభ్యులు, జాతీయసాహిత్య పరిషత్ సభ్యులు అభినందించారు.



నివాస ప్రాంతాలు జలమయం

దేవరకద్ర: మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్, రాయిచూర్ రోడ్, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు రోడ్ లలోని నివాస ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ముసురు వానాలతో పాటు అడపాదడపా ఓ మోస్తారుగా కురుస్తున్న వర్షాలకు వర్షం నీరు నిలవడంతో కుంటలను తలపిస్తున్నాయి. కాగా పంచాయతీ వారు జేసీబీతో కాల్వలు తీసి నీటిని తోడివేసే పనులు చేపడుతున్నారు. ఆదివారు రెండు సెంటి మీటర్లు, సోమవారం ఉదయం వరకు 2.5 సెంటి మీటర్ల వర్షపాతం నమోదు అయింది.



ఇల్లు అద్దెకు కావాలని వచ్చి మొబైల్ అపహరణ

జడ్చర్ల: ఇల్లు అద్దెకు కావాలని వచ్చి గుర్తు తెలియని ఓ యువకుడు మొబైల్ అపహరించిన ఘటన సోమవారం స్థానిక సరస్వతీనగర్ కాలనీలో చోటు చేసుకుంది. బాధిత మహిళ కథనం మేరకు...తాను అద్దెకు ఉన్న ఇంటిలో మరో పోర్షన్ ఖాళీగా ఉండడంతో యజమాని టూలెట్ బోర్డు పెట్టాడు. బోర్డు చూసి ఓ గుర్తు తెలియని యువకుడు స్కూటీపై వచ్చి తనకు ఇల్లు అద్దెకు కావాలని మహిళను వివరాలు అడిగాడు. ఈ మేరకు ఆమె తన దగ్గర ఉన్న ఫోన్‌తో ఇంటి యజమానితో మాట్లాడించారు. అనంతరం ఇంటిని వీడియో కాల్ చేసి తన తల్లికి చూపిస్తానంటూ యువకుడు మహిళ ఫోన్‌ను తనతో పాటు ఇంటి పైకి తీసుకు వెళ్లాడు. వెంటనే కిందకు వచ్చి ఫోన్‌తో స్కూటీపై ఉడాయించాడు. ఫోన్ విలువ రూ.15వేలు ఉంటుందని బాధిత మహిళ తెలిపింది.